


# ఇది ఎవరి కధ?

ఇచ్ఛాపురపు జగన్నాథరావు


సాయంత్రం ఐదు గంటల సమయం.

సెక్రటేరియట్ నుంచి క్రమ క్రమంగా అందరూ యిళ్ళకు బయల్దేరుతూ బస్సుల కోసం తొందర పడుతున్నారు.

కొంతమంది టేబుల్స్ సర్దుతున్నారు. కొంతమంది యింకా ఆలస్యం చేస్తున్న స్నేహితుల్ని త్వరగా బయల్దేరమని హెచ్చరిస్తున్నారు పని ముగియని ఆఫీసర్లూ వాళ్ళూ గుమాస్తాలవైపు యీర్ష్యగా చూస్తూ ఫైళ్ళు తెరుస్తున్నారు.

ఒక యువకుడు మట్టుకు ఇవేమీ చెయ్యడంలేదు.

పన్నెండవ అంతస్తు మెట్లమీద అలసిపోయినట్లు కొంచెం సేపాగి, మళ్ళీ మీదకు వెళ్ళడానికి మెట్లెక్కడం ప్రారంభించాడు భారంగా. క్రమంగా అతను పధ్నాలుగో అంతస్తు కూడా ఎక్కి మీదకు వెళ్ళిపోయాడు.



కొంచెం మాసిపోయిన రంగు పంట్లాం—చిరిగిన తెల్ల బుష్ షర్టు—కొద్దిగా అరిగిన అకు చెప్పులూ—మెట్లెక్కిన అలసటతోటీ, కలకత్తా వేసవి కలిగించే చిరాకుతోనూ, చెరిగిపోయిన క్రాఫుతోనూ అతను జీవితంమీద చాలా విరక్తి కలిగిన వాడిలా కనుపిస్తున్నాడు.

భవనం మీదకు రాగానే ఒక గొప్పకార్యంసాధించినట్లు నిటారుగా నిలబడి చుట్టూ చూసేడు

మహానగరం కలకత్తా అంతా తన పాదాలక్రింద కనుపిస్తోంది.

నెమ్మదిగా తూర్పువేపు అంచు దాకా నడిచి అక్కడున్న రెయిలింగ్ పట్టుకుని నిలబడ్డాడు.

రెండో, మూడో నిమిషాలు అలాగే నిలబడ్డాడు.

ఏదో చప్పుడైనట్లనిపించి వెనక్కి తిరిగాడతను.

అతనికి ఆరూ, ఏడూ అడుగుల వెనుక ఆమె నిలబడి వుంది.

క్షణమాత్రం అతను గాభరా పడ్డాడు.

ఆమెకి పాతికేళ్ళకన్నా ఉండవు. చక్కటి రూపం.

ఆమె అతనివేపే తేరిపార చూస్తోంది.

అతను కళ్ళు మళ్ళించుకునేసరికి రెండు నిమిషాలు గడిచిపోయాయి. మళ్ళీ ఇటు తిరిగి క్రిందని బొమ్మల్లా కనుపిస్తున్న కార్లనీ, మనుషుల్నీ చూడటం సాగించేడతను.

"అక్కణ్ణించి గెంతుదామని చూస్తున్నారా?" ఆమె కంఠస్వరం కూడా రూపుకి తగినట్లుగానే వుంది—తియ్యగా.

కొద్దిక్షణాల అనంతరం అతను నెమ్మదిగా వెనక్కి తిరిగి "అవును... కొంచెం సేపట్లో ఆ పనే చేస్తాను. మీరు ఒక్క అడుగు ముందుకు వేశారా, ఆ పని ఈ క్షణంలోనే చేస్తాను" అన్నాడు.

అతని చేతులు రెయిలింగ్ మీద బిగుసుకున్నాయి.

"తప్పకుండా మీ యిష్టం వచ్చినట్లే చేయండి. కాని—ఒక్కమాట మట్టుకు చెప్పదల్చుకున్నాను" ఒక్కసారి ఆగి మళ్ళీ అన్నదామె—

"ఈ సెక్రటేరియట్ బిల్డింగ్ ఆత్మహత్యలకి ఎంత మంచిదని పేరు పడినా, మీరున్న వేపు గెంతితే ఏమీ లాభం లేదు. కావాలంటే కిందకి చూడండి. దిగువ అంతస్తులో బాల్కనీ ప్రొజెక్షన్ ఉంది." అతను రెయిలింగ్ గట్టిగా పట్టుకుని కొంచెం ముందుకు వొంగి చూసి తనలో అనుకున్నాడు—"ఆమె చెప్పింది నిజమే!"

మళ్ళీ వెనక్కి వచ్చేసరికి అతనికి ఇంకొంచెం చెమట పట్టింది.

"ఉత్తరం వేపు వెళ్తే ఏ సందేహమూ లేకుండా ఆత్మహత్య చేసు

కోవచ్చు. మీరున్న దగ్గరనుంచే ఉరకాలంటే ఎవరైనా మిమ్మల్ని గట్టిగా నెట్టాలి. నేనే ఆ సహాయం చేద్దునుగానీ – ఆ ప్రమాదం జరిగినప్పటినుంచీ నాకు ఈ తూర్పువేపు చాలా భయం పుట్టుకొస్తూంది' అన్నదామె ఉన్నచోటే నిలబడి

అతను మళ్ళీ వెనక్కి తిరిగి ఆమె ముఖంలోకి చూసేడు.

ఆమె చాలా సీరియస్‌గా కనిపించింది

'ఏ ప్రమాదం?' కొంచెం కుతూహలం చూపుతూ ప్రశ్నించేడతను.

'క్రిందటి మార్చిలో – నేనూ సరిగ్గా మీరు నిలబడ్డ దగ్గరనుంచే ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించాను. ఓ పావుగంట ఆలోచించి మరీ ఉరికాను. కాని ఏం లాభం? ఆ క్రింద బాల్కనీలో దుబ్బున పడ్డాను. అక్కడ నిద్రపోతున్న దర్వాను తన నిద్రని పాడుచేసినందుకు దెబ్బలాడేడు. ఒంటికి బాగా దెబ్బలు తగిలాయి ఎముకలు విరగలేదనుకోండి కానీ ఆపుకోలేనంత ఏడుపొచ్చేసింది చివరకి బ్లౌజులో పెట్టుకున్న పెన్ను కూడా విరిగిపోయింది! ఎలాగో ప్రాణాలతో బయటపడి ఇంకెప్పుడూ సెక్రటేరియట్ తూర్పు భాగం నుంచి ఉరికి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించకూడదని ఒట్టు పెట్టుకున్నాను.'

అప్పటిదాకా గడ్డకట్టుకుపోయిన అతని ముఖంలో చిన్న నవ్వు ముందర మెరిసి – క్రమంగా పెద్దదై శబ్దంతో బయటకు వచ్చింది.

'చూడండి – ఈ కథలతో నా మనసు మారుద్దామని ప్రయత్నిస్తున్నారేమో ఏం లాభం లేదు! రెండు కాళ్ళూ కిందని తన్నిపెట్టి గట్టిగా గెంతితే రోడ్డుమధ్యలో పడతాను కొంచెం అదృష్టముంటే అప్పటికి ఏ లారీ అయినా సిద్ధంగా వుంటుంది. మీ రేవుద్దేశంతో ప్రయత్నిస్తున్నారో నాకుతెలియదు. కానీ చాలా కృతజ్ఞుడిని దయచేసి వెళ్ళిపోండి' అన్నాడతను.

'మీ కభ్యంతరం వుంటే వెళ్ళిపోతాను. కాని ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటుంటే చూడటం నాకు బలే సరదా! ఇక కొద్ది నిమిషాల్లో మీ రెలాగూ వురుకుతారు కాబట్టి దయచేసి నన్ను వుండనివ్వండి. ప్లీజ్ ..'

అతను బాధగా, ఆశ్చర్యంగా ఆమె వంక చూసేడు.

'చూడండి. ఇదేమీ చూసే విచిత్రమూ కాదు, నవ్వుకునే వినోదమూ కాదు నా భార్య నిన్నరాత్రి ఒక డ్రైవర్‌తో లేచిపోయింది! వారం రోజుల క్రిందట నన్ను ఉద్యోగంనుంచి డిస్మిస్ చేశారు!! ఎవడిదో పర్స్ కొట్టేశానని పొద్దుటి నుంచీ పోలీసులు నా కోసం వెదుకుతున్నారు!!!

నేను పడని బాధలులేవు. నేను చెయ్యని పాపాలూ లేవు.

బ్రతికే ధైర్యం లేకపోయినా చచ్చేందుకు కావలసిన పిరికితనం నాలో వుంది మీరేదో కష్టకథ చెప్పి నా జీవితంలో మిగిలి వున్న చివరి ఘడియలు పాడుచేయకండి అస్తమిస్తున్న ఆ సూర్యుణ్ణి చూస్తూ ఆయనతో పాటే నేనూ అస్తమిస్తాను. నన్ను ప్రశాంతంగా వదిలేసి మీరు వెళ్ళిపొండి" అన్నాడతను.

ఆ మాటల్లో – అతని కంఠం కొంచెం గాద్గదికమైనట్లు అనిపించింది.

ఆమె చిరునవ్వు నవ్వింది. "మీరు నా మాటలు నమ్మకపోవడంలో ఆశ్చర్యంలేదు నన్ను ప్రేమించిన వాడిని నా చేతులతో నాశనం చేశాను! ఎన్నో అబద్ధాలాడుతూ, ఆత్మగౌరవం వదిలి నీచంగా శరీరం అమ్ముకున్నాను మీలాగే, నేను పడని బాధాలేదు-చెయ్యని పాపమూ లేదు" అంది ఆమె బాధగా.

"మరైతే మీరు మళ్ళీ ఏదో విధంగా ఎందుకని చావలేదు ?"


# ఉదరాంతకి

చంటి పిల్లల సమస్త అనాసలు, లివర్ అండ్ స్ప్లీను వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును.

# అమృతసంజీవినీమాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధులను పోగొట్టి తల్లికి, గర్భస్థ శిశువునకు బలము కలిగించి సుఖప్రసవము, సత్సంతానము కలుగజేయును.

# శ్రీ భుజంగరా వైద్యశాల

ప్రొప్రయిటర్సు 'భిషక్‌శిరోమణి' పొన్నాడ పేరయ్య అండ్ సన్సు

తాళ్ళరేవు, తూర్పుగోదావరిజిల్లా.

"చెప్తాను. కాని, మీ కభ్యంతరం లేకపోతే కొంచెం మీరిటు వచ్చి కూర్చోండి. నేనూ కూర్చుని చెప్తాను. కాళ్ళు పీకుతున్నాయి" అతనొక నిమిషం ఆలోచించి "ఆల్ రైట్! కాని నన్నాపడానికే విధమైన ప్రయత్నమూ చెయ్యనని ముందర వాగ్దానం చెయ్యండి" అన్నాడు.

"తప్పకుండా మిమ్మల్ని చావకుండా ఆపుదామనే ఉద్దేశం నాకే కోశానా లేదు సరిగదా, ఆ అంచుదాకా రాకుండా ఇంకే సహాయమైనా చేస్తాను. రండి, కూర్చోండి" అతనామెకి రెండడుగుల దూరంవరకూ వచ్చి కూర్చున్నాడు.

ఆమె కూడా కూర్చుంది.

"మీరు చావడం ఎందుకు మానేశారో ఇప్పుడు చెప్పండి."


"చెప్తాను మీకో సిగరెట్ కావాలా?" అడిగిందామె.

"మీరు ... సిగరెట్లు ... కాలుస్తారా?"

ఆమె చేతిలో బ్యాగ్ తెరిచి సిగరెట్ ప్యాకెట్టూ అగ్గిపెట్టే తీసి యిచ్చింది సమాధానం చెప్పకుండా.

అతను సిగరెట్ వెలిగించాడు.

"ఆ రోజు ... నేను నిజంగా చచ్చిపోదామనే ప్రయత్నం చేశాను. కాని ఇంటికి వెళ్ళేసరికి అమ్మ



నా దెబ్బలు చూసి ఎంతో దుఃఖించింది ఏదో ప్రమాదంలో దెబ్బలు తగిలాయని చెప్పేను ఆమె నిజమే అనుకుంది ఆమె కార్చిన కన్నీటిలో నా ఆర్జనమీద వున్న ఆశ కన్న చాలా ఎక్కువ వుందని నాకు బోధపడింది అదీకాక నాకు దేవుడిమీదా కర్మమీదా నమ్మకం చాలా ఎక్కువ నేను చేసిన పాపాలు—సులభంగా చచ్చిపోతే—పరిహారం కావని తెలుసుకున్నాను అనుదినమూ ఈ నరకకూపం వంటి మహాపట్నంలో నరకంలాంటి మా ఇంట్లో జీవిస్తూ బాధపడుతూ మాత్రమే ఇలాంటి పాపాలు పరిహారమౌతాయి నా బట్టలూ రంగూ చూసి మీరేమీ మోసపోకండి ఎనాడో చేసిన పాపాలకి పుట్టిన ప్రతిఫలాల్లో ఎవరికి మిగిలినవి అవే మీరు చాలా అదృష్టవంతులు కనీసం ఈ జన్మలో ఇక మీకు బాధలుండవు

అతను సిగరెట్ పొగ ఆకాశంలోకి నెమ్మదిగా వదిలి ఒకమాట చెప్పండి. మీ రీ సమయంలో ఇక్కడి కెందుకు వచ్చారు?"

"మంచి ప్రశ్న అడిగారు. ఏనాడు నేను ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించానో ఆనాటినుంచీ మళ్ళీ నేనే విధమయిన పాపకార్యాలూ చెయ్యలేదు. ఇవాళ మళ్ళీ డబ్బు కోసం పాత పద్ధతులు ప్రారంభించాలని మనస్సు పీకసాగింది. ఇక్కడకు వచ్చి కిందటిసారి జరిగినదంతా జ్ఞాపకం తెచ్చుకుంటే తప్ప నా మనస్సుకి శక్తి కలగదనిపించింది అందుకని వచ్చాను

అతను సిగరెట్ కాల్చడం పూర్తిచేసి సిగరెట్ పీక కాలికింద నొక్కేసి ఏదో నిశ్చయానికి వచ్చినట్లు ఆమె వంక ఒరిగాడు

మీరు చెప్పినదాంట్లో కొంత నిజం వుంది చచ్చి సాధించేదేముంది? మీరు రావడంవల్ల నా ప్లానంతా పాడైపోయింది నాకు వెంటనే చావాలని లేదు అన్నాడతను

చూడండీ నేనున్నానని మీరు మొహమాటపడొద్దు మీరు చెప్తే నేను మాట్లాడకుండా వుంటాను ఇంకొక రెండు నిమిషాల్లో సూర్యుడు అస్తమిస్తాడు మీరేం చేసినా సరేకానీ నా మీద మాత్రం పూచీ వెయ్యొద్దు

అతను లేచి నిలబడి చుట్టూ చూశాడు

ఆమె కూడా నిలబడింది.

"చూడండి ... మీ రేవుద్దేశంతో యిక్కడికి వొచ్చినా నా ప్రాణం రక్షించారు. నాకూ దైవంలోనూ కర్మ మీదా నమ్మకముంది మీరు చెప్పింది నిజం! పాపాలకి ఫలితం అనుభవించి చచ్చిపోతే ఫరవాలేదు. కానీ లేకపోతే ఈ సంచయం వెనువెంట వస్తూనే వుంటుంది. అదీ కాక, మిమ్మల్ని చూసేక ఎంత దుర

దృష్టం, ఎంత నికృష్టతా అనుభవించినా మళ్ళీ జీవితంలో మంచి రోజులు వస్తాయన్న నమ్మకం కలిగింది. చాలా ధన్యవాదాలు. పదండి క్రిందకు పోదాం' అతని కళ్ళనుండి ఒకటో రెండో అశ్రుబిందువులు నెమ్మదిగా కిందకి జారేయి.

ఆమె బరువుగా నిట్టూర్చింది.

పదకొండవ అంతస్తులో రెండు నిముషాలాగి వాళ్ళిద్దరూ లిఫ్టులో కిందకి వచ్చారు.

అప్పుడే ట్రామ్ వస్తూంది. అతను త్వరత్వరగా ఆమెకు నమస్కారం చేసి పరుగెత్తుకెళ్ళి ట్రామ్ ఎక్కి వెళ్ళిపోయాడు. ఆమె తొందరగా పది అడుగులు నడిచి అక్కడ పార్క్ చేసివున్న ఒక కారు తలుపు తెరచి లోపల కూర్చుంది. అప్పటికే లోపల వున్న ఆమెభర్త 'ఇరవై నిమిషాలనుంచీ చూస్తున్నాను. నా సిగరెట్లు కూడా దగ్గరుంచుకుని ఏం చేస్తున్నావ్?' అన్నాడు. అతనికి సిగరెట్ పాకెట్ ఇస్తూ బయద్దేరమని డ్రైవర్‌కి చెప్పి 'ఒక చిత్రమైన కథ జరిగిందండీ' అని జరిగినదంతా చెప్పడం ప్రారంభించింది.

* * *

అతను బాలీగంజ్‌లో ట్రామ్ దిగగానే ఒక స్నేహితుడు కనుపించాడు. 'రా బ్రదర్, కాఫీ ఇస్తాను. ఇందాకా సెక్రటేరియట్ టాప్ ఫ్లోర్ మీదకి వెడితే ఒక విచిత్రమైన కథ నిజంగా జరిగింది. నీకు చెప్పాలి' అని అతన్ని హోటల్‌కి లాక్కెళ్ళాడు.

***

---

సీతాకాలంలో, మంచి చలిరాత్రిలో కాలవలో దూకబోతున్న ఒక మనిషిని, దారినపోతున్న మరో మనిషి గట్టిగా పట్టుకొని ఇలా అన్నాడు—

'ఇప్పుడు నువ్వుగనక కాలవలో దూకితే, నిన్ను కాపాడటానికి నేనుదూకాలి. నిన్నుకాపాడి బయటికి వచ్చిన తరువాత, ఏ యాంబులెన్సో వచ్చేవరకూ మనమీ చలిలో జాగరణచేయాలి. రాత్రంతా చలిలో వుండటంవల్ల మనిద్దరికీ ఏ న్యూమోనియాయో వచ్చి చచ్చిపోవొచ్చు. నన్నుగూడా నీతోబాటు చంపేబదులు హాయిగా ఇంటికిపోయి పడుకోకూడదూ?'

— ప్రసాద్ వి. నాగేంద్ర